


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 62 శనివారం 1 ఆగష్టు 2026 పేజీలు : 8 వెల : 2/-

## టామ్‌కాం సేవలను మరింతగా బలోపేతం చేయాలి

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ టామ్‌కాం సేవలను మరింతగా బలోపేతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజేయాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం – మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఉపాధి, నైపుణ్యాల పై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాల పై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షకు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.


2

## భోగాపురం.. ఆధునిక ఎయిర్ పోర్టుకు ప్రతిరూపం: ప్రధాని మోదీ


2

- భోగాపురంలో సెమీకండక్టర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- కర్నూలు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుకు శ్రీకారం
- కీలక జాతీయ రహదారి ప్రాజెక్టులు జాతికి అంకితం
- సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన ప్రధాని నరేంద్ర మోదీ

## భారత్ పై ట్రంప్ ప్రభుత్వ ప్రత్యేక దృష్టి.. కొత్త దౌత్య వ్యూహం సిద్ధం

- ట్రంప్ కొత్త వ్యూహంలో భారత్‌కు ప్రాధాన్యం
- ఆసియా పై దృష్టి పెంచనున్న అమెరికా
- చైనా ప్రచారాన్ని ఎదుర్కోవడమే లక్ష్యం
- డిజిటల్ వేదికలకు అధిక ప్రాధాన్యం
- షార్ట్ వీడియోలు, పోడ్‌కాస్ట్‌ల పై ఫోకస్
- యూఎస్ఏజీఎం అధిపతి సారా రోజర్స్ వెల్లడి


2

## కరాచీలో 'ధురంధర్' సీన్ రిపీట్.. ఉజైర్ బలోచ్ సోదరుడి పై కాల్పులు

పాకిస్థాన్‌లోని కరాచీలో గ్యాంగ్‌స్టర్, నిషేధిత పీపుల్స్ అమన్ కమిటీ మాజీ చీఫ్ ఉజైర్ బలోచ్ సోదరుడు జుబైర్ బలోచ్ పై కాల్పులు జరిగాయి. గురువారం సాయంత్రం జుబైర్ తన ఇంటి బయట ఉన్న సమయంలో మోటార్ సైకిల్ పై వచ్చిన దుండగులు అతడి పై కాల్పులకు తెగబడినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.


2

## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే: పవన్ కల్యాణ్


2

- పవన్ తో సమావేశమైన నిమ్మల రామానాయుడు
- రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితుల పై చర్చించిన నేతలు
- నీటి ఎద్దడి పై రైతుల్లో అవగాహన కల్పించాలన్న పవన్

## పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

- బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి
- గుండెపోటుతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అస్తమయం
- ఐదు రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉన్నా ఫలించని చికిత్స
- 2018లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సుదర్శన్‌రెడ్డి
- సాధారణ రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన నేత


2

## వివాహితులైన కుమార్తెలకు ఉద్యోగ హక్కు: కారుణ్య నియామకం పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు


2

- కారుణ్య నియామకాలకు పెళ్లైన కుమార్తెలు కూడా అర్హులేనని సుప్రీం స్పష్టీకరణ
- విడాకులు తీసుకున్న వారికే అర్హత అనే నిబంధన రాజ్యాంగ విరుద్ధమని తీర్పు
- కుమారులు, కుమార్తెల మధ్య వివక్ష చూపరాదని తేల్చిచెప్పిన ధర్మాసనం

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 1 ఆగష్టు 2026

## భారత్ పై ట్రంప్ ప్రభుత్వ ప్రత్యేక దృష్టి.. కొత్త దౌత్య వ్యూహం సిద్ధం

ట్రంప్ ప్రభుత్వ కొత్త ప్రజా దౌత్య వ్యూహంలో భారత్‌కు కీలక స్థానం దక్కింది. ఆసియా పై మరింత దృష్టి సారిస్తూ విదేశాల్లో సమాచార వ్యాప్తి విధానాన్ని మార్చేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ క్రమంలో భారత్, జపాన్ వంటి దేశాలకు ప్రాధాన్యం పెంచనున్నట్లు అమెరికా గ్లోబల్ మీడియా ఏజెన్సీ (యూఎస్ఏజీఎం) డైరెక్టర్ పదవికి నామినేట్ అయిన సారా రోజర్స్ వెల్లడించారు. అమెరికా సెనేట్ విదేశాంగ వ్యవహారాల కమిటీ ముందు మాట్లాడిన రోజర్స్.ఆసియా తమ ప్రాధాన్య ప్రాంతాల్లో ఒకటిగా ఉంటుందని చెప్పారు. చైనా, ఇతర నిరంకుశ దేశాల దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొనే ందుకు కొత్త వ్యూహం అవసరమని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఫ్రీ ఆసియా, రేడియో ఫ్రీ యూరప్ వంటి అంతర్జాతీయ ప్రసార సంస్థలను యూఎస్ఏజీఎం నిర్వహిస్తోంది. భారత్, జపాన్‌లో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఆ దేశాలపై తాను ఎక్కువగా దృష్టి పెట్టినట్లు రోజర్స్ తెలిపారు. ఈ దేశాలకు సంబంధించిన పోస్టులను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేసినట్లు చెప్పారు. సంప్రదాయ రేడియో, టెలివిజన్‌కే పరిమితం కాకుండా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే డిజిటల్ వేదికల పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.భవిష్యత్తులో షార్ట్ వీడియోలు, పాడ్‌కాస్ట్‌లు, ప్రవాస భారతీయుల గ్రూప్ చాట్‌లు కూడా సమాచార వ్యాప్తిలో కీలక పాత్ర పోషిస్తాయని రోజర్స్ పేర్కొన్నారు. స్వతంత్ర సమాచారం అందుబాటులో లేని దేశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని చెప్పారు. చైనాతో వాణిజ్యం, సాంకేతిక రంగం, రక్షణతో పాటు సమాచార రంగంలోనూ పోటీ పెరుగుతున్న వేళ ఈ మార్పులు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## కరాచీలో 'ధురంధర్' సీన్ రిపీట్.. ఉజైర్ బలోచ్ సోదరుడి పై కాల్పులు

ఈ ఘటనలో జుబైర్ ఛాతి, పొత్తికడుపులో బుల్లెట్లు దిగాయి. తీవ్రంగా గాయపడిన అతడిని కరాచీలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాల్పుల ఘటనలో మరో ఇద్దరు పాదచారులు కూడా గాయపడినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ పోలీసుల కథనం ప్రకారం.. ముఖాలకు ముసుగులు ధరించి వచ్చిన దుండగులు జుబైర్‌పై కాల్పులు జరిపారు. అయితే ఓ దుకాణదారుడు వారిపై ఎదురు కాల్పులు జరపడంతో నిందితులు పరారయ్యారు. ఘటన సమయంలో జుబైర్ తన ఇంటి బయట ఉన్నట్లు సీనియర్ పోలీసు అధికారి సయ్యద్ అసద్ రజా వెల్లడించారు.

**గ్యాంగ్ వార్, వ్యక్తిగత కక్షల నేపథ్యంలోనే దాడి..**

గ్యాంగ్ వార్, క్రిమినల్ యాక్టివిటీ నేపథ్యంలో జుబైర్ బలోచ్ 2012లో అరెస్టయ్యాడు. గత ఏడాది జనవరిలో జైలు నుంచి విడుదలయ్యాడు. పాత కక్షలు, గ్యాంగ్ వార్ నేపథ్యంలోనే జుబైర్‌పై కాల్పులు జరిగి ఉండొచ్చని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

**లియారీలో మళ్లీ గ్యాంగ్‌వార్.. భయాందోళనలో స్థానికులు..**

జుబైర్ బలోచ్ కొన్ని నెలల క్రితం ఓ రాజకీయ పార్టీలో చేరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీ జెండాలను జుబైర్ తన ప్రాంతంలో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో 'కరాచీ ఆపరేషన్' తర్వాత దుబాయ్, ఇరాన్‌కు పారిపోయిన కొందరు గ్యాంగ్‌స్టర్లు అమెరికా-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో తిరిగి కరాచీకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో లియారీ ప్రాంతంలో మళ్లీ గ్యాంగ్ వార్ చెలరేగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**జైల్లో ఉజైర్ బలోచ్..**

ఇదిలా ఉండగా.. గ్యాంగ్‌స్టర్ ఉజైర్ బలోచ్‌పై పాకిస్థాన్‌లో చాలా కేసులు ఉన్నాయి. హత్యలు, పోలీసులపై కాల్పులు, పేలుడు పదార్థాల తయారీ, సరఫరా తదితర కేసుల్లో అతడు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. 2012లో కలకోట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయుధాలు, పేలుడు పదార్థాలతో భద్రతా సిబ్బందిపై దాడి చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ కేసుల్లో ఉజైర్ బలోచ్‌ను పాకిస్థాన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గూఢచర్యం కేసులో 2020 ఏప్రిల్‌లో కోర్టు అతడిని దోషిగా తేల్చి 12 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, తనపై నమోదైన అన్ని కేసుల్లో బెయిల్ ఇవ్వాలంటూ ఉజైర్.. పాకిస్థాన్ యాంటీ టెర్రరిజం కోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్లను 2026 మార్చిలో కోర్టు తిరస్కరించింది. దీంతో ఉజైర్ జైల్లోనే శిక్ష అనుభవిస్తున్నాడు.

## పీఎం-కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు

కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త అందించింది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించాలని నిర్ణయించింది. శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. ఈ పొడిగింపుతో పీఎం-కిసాన్ పథకం 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు అమల్లో ఉండనుంది. ఇందుకోసం రాబోయే ఐదేళ్లకు గానూ రూ. 3,15,614 కోట్లను కేటాయిం చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 6,000 ఆర్థిక సాయం అందుతున్న విషయం విదితమే. ఈ మొత్తాన్ని మూడు సమాన వాయిదాల్లో, అంటే ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ. 2,000 చొప్పున ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా నేరుగా ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. రైతులకు కనీస ఆదాయ భరోసా కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 24న ఈ పథకాన్ని ప్రారంభించింది. కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయం వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక మద్దతు నిరంతరాయంగా కొనసాగనుంది. మరోవైపు, రాబోయే ఐదేళ్లలో 5,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ. 5,070 కోట్లను కేటాయించింది. అలాగే, ఖేల్ ఇండియా పథకానికి రూ. 29 వేల కోట్లు, సముద్ర మంథన్ ప్రాజెక్టుకు రూ. 84 వేల కోట్లు, సొరంగాల నిర్మాణం కోసం రూ. 9,779 కోట్లు కేటాయిస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది.

# టామ్‌కాం సేవలను మరింతగా బలోపేతం చేయాలి

విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం – మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఉపాధి, నైపుణ్యాల పై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షకు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలు నమోదు చేయాలి..**

విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**స్కాలర్‌షిప్‌ల పై అధ్యయనం చేయాలి..**

బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# భోగాపురం.. ఆధునిక ఎయిర్ పోర్టుకు ప్రతిరూపం: ప్రధాని మోదీ

ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టుల పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించే ఈ ప్రాజెక్టుల వివరాలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. వీటిలో ప్రధాన ఆకర్షణగా విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తోంది. ఈ విమానాశ్రయానికి సంబంధించిన ఆకర్షణీయమైన ఫొటోలను కూడా ప్రధాని పంచుకున్నారు. భోగాపురం విమానాశ్రయం ఒక ఆధునిక, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా నిర్మించిన ప్రాజెక్టు అని ప్రధాని అభివర్ణించారు. కనెక్టివిటీ, వాణిజ్యం, పర్యాటకాన్ని ఇది గణనీయంగా పెంచుతుందని తెలిపారు. సుస్థిరత, ఇంధన సామర్థ్య సూత్రాలను పాటిస్తూ ఈ విమానాశ్రయాన్ని నిర్మించారని పేర్కొన్నారు. వీటితో పాటు మరిన్ని కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నట్లు మోదీ వెల్లడించారు. భోగాపురంలో ఏఎస్ఐపి సెమీకండక్టర్ ప్రాజెక్టుకు, అలాగే కర్నూలు-×ఒ పునరుత్పాదక ఇంధన జోన్ (ఆర్ఈజెడ్) మొదటి దశ అనుసంధానానికి సంబంధించిన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో, రాష్ట్రంలో పూర్తయిన కొన్ని కీలకమైన రహదారి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నట్లు ప్రధాని తన పోస్టులో వివరించారు. వీటిలో ఎన్ హెచ్-365బీజీ పరిధిలోని రేచర్ల - గురువాయిగూడెం మధ్య నాలుగు వరుసల రహదారి, గురువాయిగూడెం - దేవరపల్లి సెక్షన్, ఎన్ హెచ్-67పై నిర్మించిన తాడిపత్రి బైపాస్ ఉన్నాయని పేర్కొన్నారు. విమానయానం, సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, రహదారి రవాణా వంటి కీలక రంగాల్లో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే: పవన్ కల్యాణ్

రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల నెలకొన్న సాగునీటి కొరత పై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో అమూల్యమైనదని, కాలువల్లో పూడిక తీత, గట్ల లీకేజీల నివారణ వంటి తక్షణ చర్యల ద్వారా నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి సారించాలని పవన్ సూచించారు. రైతుల ఆందోళనను తగ్గించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాల న్నారు. పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల రైతు ప్రయోజనాల కోసం ఏలేరు ప్రాజెక్టు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు మంత్రి నిమ్మల రామానాయుడికి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు తానే స్వయంగా ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు మంత్రి వివరించారు. కాగా, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని మంత్రి నిమ్మల అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరితగతిన పూర్తి కోలుకుని, మళ్లీ ప్రజాసేవలో మునుపటి కంటే మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (52) కన్నుమూశారు. గత ఐదు రోజులుగా గుండెపోటుతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన, గురువారం అర్ధరాత్రి 12.50 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు అధికారికంగా ప్రకటించారు. ఆయన మరణవార్తతో బీఆర్ఎస్ శ్రేణుల్లో, నర్సంపేట నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ నెల 26న హనుమకొండలోని తన నివాసంలో ఉన్న సుదర్శన్‌రెడ్డికి ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు వైద్యులు గుర్తించారు. సుమారు గంట పాటు శ్రమించి, తొమ్మిది సార్లు సీపీఆర్ చేసిన తర్వాత ఆయన గుండె తిరిగి స్పందించింది. దీంతో మెరుగైన చికిత్స కోసం వెంటనే సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రత్యేక వైద్య బృందం ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ప్రారంభించింది. అయితే, సుదీర్ఘకాలం స్పృహలోకి రాకపోవడంతో నాడీ సంబంధిత స్పందన కనిపించలేదు. ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం కారణంగా మెదడుకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఈసీజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ పరీక్షల్లో తేలిందని వైద్యులు తెలిపారు. ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడిన ఆయన చివరకు కన్నుమూశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో 1974 ఆగస్టు 6న ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్‌రెడ్డి, రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. తొలుత కాంగ్రెస్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన, 2001లో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరారు. అదే ఏడాది నల్లబెల్లి జడ్పీటీసీగా గెలుపొందారు. 2015లో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2018 శాసనసభ ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు.

## వివాహితులైన కుమార్తెలకు ఉద్యోగ హక్కు: కారుణ్య నియామకం పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

కారుణ్య నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. వివాహిత అనే కారణంతో కుమార్తెకు కారుణ్య నియామకాన్ని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. కేవలం విడాకులు తీసుకున్న లేదా భర్త నుంచి విడిపోయిన కుమార్తెలకు మాత్రమే ఈ అవకాశం కల్పించే ప్రభుత్వ నిబంధనలు చెల్లవని తేల్చిచెప్పింది. ఇటువంటి వర్గీకరణ రాజ్యాంగంలోని అధికరణ 14 ప్రకారం కల్పించిన సమానత్వ హక్కుకు పూర్తి విరుద్ధమని న్యాయస్థానం పేర్కొంది. బీహార్ ప్రభుత్వానికి చెందిన 2014 నాటి విధానాన్ని సవాలు చేస్తూ సయారా ఖాతూన్, ఆమె కుమార్తె దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తండ్రి మరణానంతరం ఉద్యోగం కోసం కుమార్తె చేసుకున్న దరఖాస్తును తొలుత బీహార్ ప్రభుత్వం, అనంతరం పాట్నా హైకోర్టు తిరస్కరించడంతో బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "కుమారులు, కుమార్తెల మధ్య ఎలాంటి వివక్ష చూపినా అది రాజ్యాంగబద్ధం కాదు. వివాహం తర్వాత కుమార్తెకు పుట్టింటితో బంధం తెగిపోతుందని, ఆమె కేవలం భర్తపైనే ఆధారపడి జీవిస్తుందని భావించడం తగదు" అని అభిప్రాయపడింది. కేవలం సాంకేతిక కారణాలను సాకుగా చూపి దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని స్పష్టం చేసింది. మృతుడి సోదరుడు తొలుత అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, అనంతరం నిరభ్యంతర పత్రం సమర్పించిన విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. పాట్నా హైకోర్టు ఉత్తర్వులను, బీహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసిన సుప్రీంకోర్టు పిటిషనర్ అభ్యర్థనను ఎనిమిది వారాల్లోగా మెరిట్ ప్రాతిపదికన పునఃపరిశీలించాలని అధికారులను ఆదేశించింది. కారుణ్య నియామకాలకు కుటుంబ ఆర్థిక స్థితిగతులు, అవసరాలే ప్రామాణికం కావాలని, వివాహ స్థితి కాదని ఈ తీర్పు ద్వారా సర్వోన్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది.

# హైడ్రా నుంచి రంగనాథ్‌ను వెంటనే బదిలీ చేయండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను, ఆయన్ను తక్షణమే ఆ పదవి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తాజాగా, రంగనాథ్ స్థానంలో మరొక అధికారిని నియమించాలని నేడు ఉత్తర్వులు జారీ చేసింది. లోతుకుంట భూముల వ్యవహారంలో హైడ్రాకు, శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ కేసులో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రంగనాథ్ స్పష్టంగా ఉల్లంఘించారని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. వివాదాస్పద స్థలంలోకి యంత్రాలు, సిబ్బందితో ప్రవేశించడం పూర్తిగా చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. ఇదే కేసులో రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని గతంలోనే హైకోర్టు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. టాటా మోహన్ రావు కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఉటంకిస్తూ, దేశంలో చట్టబద్ధమైన పాలన మాత్రమే కొనసాగాలని స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం పెరగడం ప్రజాస్వామ్యానికి 'మరణశాసనం' వంటిదని హైకోర్టు ఘాటుగా హెచ్చరించింది.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 1 ఆగష్టు 2026

## పేదలకు అండగా కలాం ఫౌండేషన్



కర్లపాలెం జూలై 31 వార్త సాక్ష్యం

కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండలం చందోలుకు చెందిన ఓ నిరుపేద మహిళకు ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ బాషా 10 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాతలు మరియు ఫౌండేషన్ సభ్యుల సహకారంతో ప్రతి శుక్రవారం పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు అనారోగ్యంతో బాధపడు తున్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆపన్నులను గుర్తించి వారికి నిరంతరం అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాలను క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేద లను గుర్తించి ప్రతి శుక్రవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేసే సేవా కార్యక్ర మాలను మరింత విస్తృతంగా కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందోలు లింగోద్భవ దేవాలయ చైర్మన్ పరిమి రామకృష్ణ సాయి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు షేక్ బాషా, షేక్ బహదూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా కూటమి ప్రచారంలో ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి జూలై 31 వార్త సాక్ష్యం

కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం 11వ వార్డులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలతో పాటు రానున్న రోజుల్లో ప్రజలకు అందించనున్న సేవలు, చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతు న్నాయా లేదా అనే విషయాన్ని ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే, 11వ వార్డులో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలికల కల సాకారం

-విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో వసతి గృహాన్ని ప్రారంభించనున్న ఎంపీ, ఎమ్మెల్యే

రెంటచింతల జూలై 31 వార్త సాక్ష్యం



రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం మోడల్ స్కూల్లో రూ.1.90 కోట్ల వ్యయంతో నిర్మించిన బాలికల వసతి గృహం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 2వ తేదీన ఎంపీ, కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా హాస్టల్‌ను ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కె. పాపయ్య తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లుగా హాస్టల్ కోసం ఎదురుచూస్తున్న బాలికల కల ఇప్పుడు సాకారం కానుందని అన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు తొలి అంతస్తులో మొత్తం 25 గదులు నిర్మించగా, 100 మంది బాలికలకు వసతి కల్పించే అవకాశం ఉందని వివరించారు. 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మోడల్ స్కూల్లో 2013 జూన్ నుంచి విద్యాబోధన కొనసాగుతోందని తెలిపారు. పాఠశాల ఆవరణలోని బండరాళ్లతో కూడిన ఆటస్థలాన్ని చదును చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

-విమానాశ్రయ ప్రారంభోత్సవ సన్నాహాలు ఏర్పాట్ల పరిశీలన చేస్తున్న గుంటూరు కమిషనర్

విశాఖపట్నం జూలై 31 వార్త సాక్ష్యం



అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్) అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మ రంగా సాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో సభకు హాజరయ్యే ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వీఐపీల కోసం ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలను ఆయన పరిశీలించారు. తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య ఏర్పాట్లు, ప్రధాన వేదిక నిర్మాణం, లైటింగ్, వీఐపీ గ్యాలరీ తదితర పనుల పురోగతిని సమీక్షించారు. ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, రహదారులను ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేయాలని అధికారు లను ఆదేశించారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేలా అన్ని ఏర్పాట్లు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ కె. మయూర్ అశోక్ స్పష్టం చేశారు.

# డీఎస్సీ పై వైసీపీ దుష్ప్రచారం ఆపాలి




-టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మువ్వా శరత్ చంద్ర

చీరాల జూలై 31 వార్త సాక్ష్యం

కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలని బాపట్ల జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మువ్వా శరత్ చంద్ర డిమాండ్ చేశారు. చీరాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నియామక ప్రక్రియను నిర్వహించిందని తెలిపారు. ఆధారాలు లేకుండా అక్రమాలు జరిగాయని ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. ఆముదాల వలసలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఎస్ఐతో వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తులు దురుసుగా ప్రవర్తించడం అత్యంత ఖండనీయమన్నారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసు అధికారిని దిగ్బంధించి ఇబ్బందులకు గురిచేయడం చట్టవ్యతిరేక చర్య అని, ఇందుకు బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రత, పోలీసు వ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొతరపు జనార్ధనరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దోగిపర్తి బాలకృష్ణ, టౌన్ అధ్యక్షుడు దోగుబర్తి సురేష్, చీరాల మండల యువత అధ్యక్షుడు గొర్ల నరేంద్ర, టౌన్ బీసీ సెల్ అధ్యక్షుడు వల్లెపు వేణు, కోటి దాసు, బుర్ల శివప్రసాద్, గుమ్మడి యేసురత్నం, సున్నపు సుబ్బారావు, చెన్నంశెట్టి గిరీష్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రధాని రాకతో సన్నాహాల పై సమీక్ష

భోగాపురం జూలై 31 వార్త సాక్ష్యం



అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక ఘట్టమని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే, గజపతినగరం నియోజకవర్గ పరిశీలకుడు నక్కా ఆనందబాబు అన్నారు. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరగనున్న ప్రారంభోత్సవం విజయవంతం అయ్యేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం లోని విమానాశ్రయ పరిపాలనా కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలోని 34 నియోజక వర్గాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా జనసమీ కరణ, రవాణా, సభ నిర్వహణ, ప్రజాప్రతినిధులు--పార్టీ నాయకుల సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రూ.5,641 కోట్ల వ్యయంతో నిర్మితమైన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రలో పారిశ్రా మిక, పర్యాటక, వాణిజ్య రంగాలకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఏటా 25 వేల మెట్రిక్ టన్నుల కార్గో నిర్వహణ, 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో ఈ విమానాశ్రయం ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదం డుతుందన్నారు. భవిష్యత్తులో దీనిని నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే స్థాయికి విస్తరించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మామిడి, మత్స్య ఉత్పత్తుల ఎగుమతులకు ఈ విమానాశ్రయం ఊతమివ్వడంతో పాటు బీచ్ కారిడార్ అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం ద్వారా ఆయన త్యాగానికి సముచిత గౌరవం దక్కిందని పేర్కొన్నారు. సమీక్ష అనంతరం ప్రధాన వేదిక, వీఐపీ గ్యాలరీ, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ, భద్రత, తాగునీటి సదుపాయాలు, వైద్య శిబిరాలు, ప్రజల కోసం కల్పిస్తున్న ఏర్పాట్లను నక్కా ఆనందబాబు ప్రత్యక్షంగా పరిశీలించి, కార్యక్రమం విజయవంతం అయ్యేలా అవసరమైన సూచనలు చేశారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# దక్షిణ తీర రైల్వే ఆకస్మిక తనిఖీ



-సురక్షిత ప్రయాణం, మౌలిక సదుపాయాలు మరియు ప్రయాణికుల వసతులపై సమీక్ష

గుంటూరుజూలై 31 వార్త సాక్ష్యం

దక్షిణ తీర రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ నంద్యాల--గుంటూరు సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించి, భద్రత, మౌలిక సదుపాయాలు, ప్రయాణికుల వసతులు, నిర్మాణ పనుల పురోగతిపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.దక్షిణ తీర రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సందీప్ మాథూర్, నంద్యాల - గుంటూరు సెక్షన్‌లో సమగ్ర తనిఖీలు నిర్వహించారు. మార్గమధ్యంలో భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ సామర్థ్యం మరియు ప్రయాణికుల సౌకర్యాలను ఆయన సమీక్షించారు.ఈ తనిఖీ నంద్యాల రైల్వే స్టేషన్ నుండి ప్రారంభమైంది. అక్కడ 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' కింద జరుగుతున్న పునర్నిర్మాణ పనులను జనరల్ మేనేజర్ వివరంగా పరిశీలించారు. ప్రయాణికుల వసతులను తనిఖీ చేసి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనుల నాణ్యతను, వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే సిబ్బంది విశ్రాంతి గది (Running Room) మరియు క్రూ లాబీని పరిశీలించి, రైల్వే సిబ్బందికి కల్పిస్తున్న సౌకర్యాలను సమీక్షించారు. రైల్వే ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వీరికి ఆధునిక వసతులు కల్పించడం వల్ల సురక్షితమైన మరియు సమర్థవంతమైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. అనంతరం గాజులపల్లె రైల్వే స్టేషన్‌లో సిగ్నలింగ్ ఓ టెలికమ్యూనికేషన్స్ (S&T) రిలే రూమ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆ తర్వాత చలమ - దిగువమెట్ట సెక్షన్‌లో నిర్మాణంలో ఉన్న రైల్వే టన్నెల్ పనులను, భద్రతా ప్రమాణాలను సమీక్షించారు. పనుల నాణ్యతను, భద్రతా నిబంధ నలను పాటిస్తూ నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.తరువాత, కంభం చెరువు - కంభం సెక్షన్‌లోని లెవెల్ క్రాసింగ్ గేట్ నంబర్ 219ని పరిశీలించి, గేట్‌కీపర్‌తో మాట్లాడారు. సేఫ్టీ రిజిస్టర్ల నిర్వహణ మరియు కార్యాచరణ సన్నాహకాలను తనిఖీ చేశారు. మార్కాపురం రోడ్ రైల్వే స్టేషన్‌లో శ్రీ సందీప్ మాథూర్ రైల్వే భద్రతా వ్యవస్థలు మరియు స్టేషన్ మౌలిక సదుపాయాలను విస్తృతంగా పరిశీలించారు. పట్టాల ఆరోగ్యాన్ని, నిర్వహణ ప్రమాణాలను అంచనా వేయడానికి నిర్వహించే అల్ట్రాసోనిక్ ఫ్లా డిటెక్షన్ (USFD) టెస్టింగ్‌ను, పాయింట్లు మరియు క్రాసింగ్ లను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. స్టేషన్ సౌకర్యాలను మరియు సమగ్ర భద్రతా సన్నద్ధతను సమీక్షించిన ఆయన, అత్యున్నత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమ ంలో జనరల్ మేనేజర్‌తో పాటు గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ (DRM) శ్రీమతి సాధనా సేన్, వివిధ విభాగాల అధిపతులు (PHODs) మరియు ఇతర ముఖ్య రైల్వే అధికారులు పాల్గొన్నారు.జారీ చేసిన వారు: డి. వినయ్ కాంత్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (PRO), దక్షిణ తీర రైల్వే, గుంటూరు డివిజన్.

## వైసీపీ ఆధారాల్లేని ఆరోపణలు సరికావు



రెంటచింతల జూలై 31 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని, దానిపై వైసీపీ ఆధారర హిత ఆరోపణలు చేస్తూ చౌకబారు రాజకీయాలకు పాల్పడు తోందని రాష్ట్ర శిల్పారామం కమిటీ చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి విమర్శించారు. గురువారం రెంటచింతలలో నిర్వహించిన సమావే శంలో ఆమె మాట్లాడుతూ, కేంద్రంలోని నీట్ పేపర్ లీక్ ఘటనను రాష్ట్ర డీఎస్సీకి ముడిపెట్టి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వం డీఎస్సీని సమర్థవంతంగా నిర్వహించి నిరుద్యోగ యువతలో విశ్వాసం కల్పించిందని చెప్పారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు వైసీపీ ప్రారంభం నుంచే పలు విధాలుగా ప్రయత్నించిందని, కోర్టుల్లో వరుస పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ప్రభుత్వం అన్ని అడ్డంకులను అధిగమించి నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు.డీఎస్సీలో అక్రమాలు జరిగాయని నిజంగా భావిస్తే మంత్రి నారా లోకేష్ విసిరిన బహిరంగ సవాల్‌ను స్వీకరించి చర్చకు రావాలని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం, రాజీనామాలు కోరడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని మండిపడ్డారు. ఇలాంటి ఆరోపణలతో నిరుద్యోగ యువతలో వైసీపీ విశ్వసనీయత మరింత దెబ్బతింటుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చేర్రెడ్డి కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, యలమంద తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



-జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం

-అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

పల్నాడు, జూలై 31 వార్త సాక్ష్యం

పల్నాడు జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను కలెక్టర్ కృతిక శుక్లా విడుదల చేశారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని, ప్రతి ఓటరూ వివరాలు ధృవీకరించుకోవాలని సూచించారు. పల్నాడు జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్లా శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. అనంతరం జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఎన్నికల నమోదు అధికారులకు (ఈఆర్‌వోలు) జాబితా ప్రతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 15,49,802 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 7,58,339 మంది, మహిళలు 7,91,312 మంది, ట్రాన్స్‌జెం డర్లు 151 మంది ఉన్నారని వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో 1,91,996 మంది ఓటర్లను ఏఎస్‌డీడీ కింద తొలగించినట్లు తెలిపారు. వీరిలో 46,157 మంది ఆచూకీ లేని వారు, 61,868 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, 24,378 మంది మరణించిన వారు, 99 మంది డబుల్ లేదా ఇతర కారణాలతో తొలగించబడినట్లు వివరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఎవరైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు కోరుకుంటే జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు సంబంధిత బీఎల్‌ఓ, ఏఈఆర్‌వో, ఈఆర్‌వో కార్యాలయాల్లో లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఓటరూ తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైతే సవరణలు చేయించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసిన అర్హులైన యువత ఫారం--6తో పాటు అనెక్సర్--డీ సమర్పించి కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో వివరాలు సమర్పించని వారు లేదా వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేస్తామని, అలాంటి వారు నిర్ణీత గడువులోపు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు. ఓటరు గుర్తింపుకు ప్రభుత్వం నిర్దేశించిన 11 రకాల చెల్లుబాటయ్యే పత్రాలు అందుబాటులో ఉన్నాయని, వాటిలో ఏదో ఒకటి సమర్పించి వివరాలను ధృవీకరించుకోవచ్చన్నారు. అలాగే జిల్లాలో 1,195 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహిస్తున్నామని, ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని కలెక్టర్ కృతిక శుక్లా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అద్దయ్య, ఎన్నికల శాఖ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సిద్ధం

రెంటచింతల జూలై 31 వార్త సాక్ష్యం



రెంటచింతల మండలం లోని ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) కార్యక్రమం ముగియడంతో మండలానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం తహశీల్దార్ మద్రి దీప్తి విడుదల చేశారు. ప్రస్తుతం మండలంలో మొత్తం 36,064 మంది ఓటర్లు ఉన్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆగస్టు 30 వరకు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశం ఉంటుందని తెలిపారు. అందిన అభ్యంతరాలను బీఎల్‌వోలు స్వీకరించి సెప్టెంబర్ 28లోపు పరిష్కరిస్తామని, అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని చెప్పారు. రెంటచింతల మండలంలోని 11 గ్రామాలు, 132 వార్డులు, 50 పోలింగ్ కేంద్రాలకు గతంలో 40,674 మంది ఓటర్లు ఉండగా, తాజా ముసాయిదా జాబితాలో ఆ సంఖ్య 36,064కు తగ్గిందన్నారు. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన ఓటర్లు, చిరునామా మార్పులు, ఇతర వివరాలు అందుబాటులో లేని వారి పేర్లను తొలగించడంతో ఓట్లు తగ్గినట్లు వివరించారు. అనంతరం టీడీపీ, బీజేపీ, సీపీఐ, వైసీపీ ప్రతినిధులు, గ్రామాభ్యుదయ కమిటీ సభ్యులు, విద్యావేత్త నారాయణపురం తదితరులతో సమావేశం నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలను తహశీల్దార్ వెల్లడించారు.

# 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమానికి విశేష స్పందన- శ్రేణులను అభినందించిన లోకేశ్

-ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం ఐదో రోజూ విజయవంతం

-5 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి నేతలు

-రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరణ

-కార్యకర్తలను వ్యక్తిగతంగా అభినందిస్తూ ప్రోత్సహిస్తున్న మంత్రి నారా లోకేశ్

జూలై 31 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లో అధికార తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ -- 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. ఐదో రోజుకు చేరుకున్న ఈ కార్యక్రమం ద్వారా కూటమి నాయకులు, కార్యకర్తలు గడిచిన ఐదు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల కుటుంబాలను నేరుగా కలిశారు. రెండేళ్ల పాలనలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమం కింద శుక్రవారం ఒక్కరోజే కూటమి శ్రేణులు సుమారు 2.80 లక్షల ఇళ్లను సందర్శించాయి. ఇంటింటికీ వెళ్తున్న నేతలు, కార్యకర్తలు ముఖ్యంగా రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక అంశాలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకుంటున్నారని టీడీపీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు. శ్రేణులను ప్రోత్సహిస్తున్న మంత్రి నారా లోకేశ్ "ఇంటింటికీ టీడీపీ" కార్యక్రమం పురోగతిని మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు న్నారు. క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొంటూ ఉత్తమ పనితీరు కనబరుస్తున్న నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. కొందరికి వ్యక్తిగతంగా ఎస్ఎంఎస్‌లు పంపుతూ, మరికొందరితో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. పార్టీ శ్రేణులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, రానున్న రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ విజయాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా వివరించాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమని ఆయన ప్రశంసించారు.



VARTHA SAKSHAMU
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక



# మహిళల భద్రతే లక్ష్యం

-పెండింగ్ కేసులను పూర్తి చేయండిఎస్పీ విక్రాంత్ పాటిల్




కర్నూలు జూలై 31 వార్త సాక్ష్యం :

మహిళల భద్రతే లక్ష్యంగా పని చేస్తూ.. మహిళలపై జరిగే నేరాలపై తక్షణమే స్పందిం చాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అదికారులను ఆదేశిం చారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారిగా చీటింగ్ కేసులు, వైట్ కాలర్ నేరాల జాబితాను సిద్ధం చేసి పురోగతిపై నిరంతరం సమీక్షించాలన్నారు. మిస్సింగ్ కేసులు, ప్రాపర్టీ నేరాల దర్యాప్తును పకడ్బందీగా చేపట్టాలన్నారు. సైబర్ నేరాల కేసులో త్వరితగతిన న్యాయం జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. సీసీఎస్ పోలీసులు బృందాలుగా ఏర్పడి ప్రాపర్టీ నేరాలను చేధించా లన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించా లన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ హుశేన్‌పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు వెంకట్రామయ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.

# ఆస్తి వివాదాల పరిష్కారానికి నక్షా

-ఇక నగరాల్లో స్థలాలకు కచ్చితమైన రికార్డులు
-కొలతలతో వివరాల క్రోడీకరణ
-నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు
-కర్నూలులో ప్రారంభమైన అర్బన్ రీసర్వే




కర్నూలు న్యూసిటీ, జూలై 31 వార్త సాక్ష్యం

నగర, పట్టణ ప్రాంతాల్లోని ఆస్తులు, స్థలాలకు కచ్చితమైన రికార్డులు రూపొందించి, నవీకరించడం ద్వారా వివాదాలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం నక్షా(నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బెస్ట్ సర్వే ఇన్ హ్యాబిటేషన్స్ ఇన్ అర్బన్ ఏరియాస్) కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తోందని నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, వీఆర్‌ఓ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నక్షా పైలట్ ప్రాజెక్టులో భాగంగా దేశవ్యాప్తంగా 152 పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్‌లో 10 పట్టణాలు ఎంపిక అయ్యాయని అన్నారు. అందులో కర్నూలు నగర పాలక సంస్థకు అవకాశం లభించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, కర్నూలు నగర పాలక సంస్థ సంయుక్త అధ్వర్యంలో ఆధునాతన పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో అర్బన్ రీ సర్వేకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. నగర పాలక సంస్థ పరిధి 114 చదరపు కిలోమీటర్లు ఉండగా, పైలట్ ప్రాజెక్టులో భాగంగా తొలి విడతలో 48 చదరపు కిలోమీటర్ల పరిధిలో సర్వే చేపడుతున్నామన్నారు. సెప్టెంబర్ 10వ తేదీలోపు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను మ్యాపింగ్ చూసి డిజిటలైజ్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వే పూర్తయిన అనంతరం ఆస్తు వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచి, అర్బన్ ప్రాపర్టీ డిజిటల్ కార్డుతో కూడిన ఆస్తి ?ధ్రువీకరణ పత్రాన్ని యజమానులకు అందజేస్తామన్నారు. దీంతో ఆస్తుల యాజమాన్యానికి సంబంధించిన వివాదాలు, దీర్ఘకాలంగా కొనసాగుతున్న చట్టపరమైన కేసుల పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. రహదారులు, మురుగు కాలువలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ ప్రాజెక్టుల అమలులో ఎదురయ్యే అడ్డంకులను అధిగమించేందుకు మొదలైన అర్బన్ రీసర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించే సమయంలో ప్రజలు తమ ఆస్తుల పత్రాలు, ఖచ్చితమైన వివరాలను సిబ్బందికి అందించి సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏసీపీ నాగరాజు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్‌బాషా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పి. నాగభూషణం, అర్బన్ సర్వేయర్ జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు టీటీడీ పకడ్బందీ ఏర్పాటు- వివరాలు ఇవిగో!

-ఈసారి రెండు పర్యాయాలు శ్రీవారి బ్రహ్మోత్సవాలు
-ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన టీటీడీ జేఈవో శరత్
-భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు
-ప్రధాన కూడళ్లలో స్వాగత తోరణాలు, విద్యుత్ దీపాల అలంకరణకు ఆదేశం
-అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచన



తిరుమల జూలై 31 వార్త సాక్ష్యం

తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఉత్సవాల సమయంలో తిరుమల, తిరుపతికి భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారి (జేఈవో) డాక్టర్ ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు అత్యుత్తమ సేవలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జేఈవో డాక్టర్ శరత్.. ఇంజినీరింగ్, ఆరోగ్యం, విజిలెన్స్ సహా వివిధ శాఖల ఉన్నతాదికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్స వాలతో పాటు పెరటాసి శనివారాల్లోనూ భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుందని, ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు. భక్తుల వాహనాల రద్దీని నియంత్రి ంచడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. తిరుపతి నగరం, శివారు ప్రాంతాల్లో అవసరమైన పార్కింగ్ స్థలాలను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రి ంచేందుకు వివిధ ప్రాంతాల్లో హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ పార్కింగ్, హోల్డింగ్ పాయింట్ల వద్ద పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, తగిన సంఖ్యలో మొబైల్ మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాలు కల్పించి నిరంతరం పర్యవేక్షించాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల శోభ ఉట్టిపడేలా తిరుపతి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని జేఈవో సూచించారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, భక్తులు ఎక్కువగా సంచ రించే ప్రాంతాల్లో స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ఆలయాలు, ప్రధాన టీటీడీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణం సృష్టించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశిం చారు. భక్తులకు సమాచారం సులభంగా అందించేందుకు కీలక ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లతో కూడిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులకు సహాయ సహకారాలు అందించేందుకు టీటీడీ ప్రజా సంబంధాల విభాగం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, అలిపిరి నడక మార్గం, విష్ణునివాసం, శ్రీనివాసం వంటి ప్రాంతాల్లో అదనపు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జేఈవో పేర్కొన్నారు. అవసరమైన చోట్ల శ్రీవారి సేవకులను నియమించి వారి సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని పీఆర్వో డాక్టర్ టి. రవికి సూచించారు. మహతి కళాక్షేత్రం, రామచంద్ర పుష్కరిణిలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ-1 శ్రీ మనోహరం, ఎస్‌ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, డీఈలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి, విజిలెన్స్ అధికారి గిరిధర్, అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ సునీల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# భువనేశ్వరి వ్యాఖ్యల్లో నిజం లేదు: లక్ష్మీపార్వతి




-అసెంబ్లీలో తనను అవమానించారన్న భువనేశ్వరి వ్యాఖ్యలను నిరూపించాలని లక్ష్మీపార్వతి సవాల్
-టీడీపీ ప్రభుత్వం అసెంబ్లీ రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్
-చంద్రబాబు, లోకేశ్ రాజకీయ లబ్ధి కోసమే భువనేశ్వరిని తెరపైకి తెచ్చారని ఆరోపణ
-ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వంపై లక్ష్మీపార్వతి విమర్శలు
-రెడ్ బుక్ పాలనపై క్షమాపణ చెప్పాకే భువనేశ్వరి రాజకీయాల్లోకి రావాలని హితవు

జూలై 31 వార్త సాక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరికి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి సవాల్ విసిరారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తనను అవమానించారంటూ భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలు నిజమైతే, అందుకు సంబంధించిన ఆధారాలను బయటపెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఇటీవల కుప్పం పర్యటనలో భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, కేవలం రాజకీయ సానుభూతి పొందేందుకే అలా మాట్లాడుతున్నారని లక్ష్మీపార్వతి కొట్టిపారేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉందని, అసెంబ్లీ రికార్డులు మొత్తం వారి చేతిలోనే ఉన్నాయని గుర్తుచేశారు. భువనేశ్వరి ఆరోపణలు నిజమే అయితే, ప్రభుత్వం వెంటనే ఆ రికార్డులను బహిర్గతం చేయాలే తప్ప, ఇలా సానుభూతి రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు చట్టబద్ధమైన రెండవ భార్యగా ఉన్న తనను ఐటీడీపీ సోషల్ మీడియాలో అసభ్యకరమైన ట్రోలింగ్, మార్ఫింగ్ చిత్రాలతో వేధించినప్పుడు భువనేశ్వరి ఎందుకు మౌనంగా ఉన్నారని లక్ష్మీపార్వతి ప్రశ్నించారు.రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ కలిసి భువనేశ్వరిని రాజకీయాల్లోకి లాగారని ఆరోపించారు. వైసీపీ ఎప్పుడూ ఆమెపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. వైఎస్ కుటుంబంలోని మహిళలపై ఆన్‌లైన్‌లో దాడులు జరిగినప్పుడు గానీ, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతు న్నప్పుడు గానీ భువనేశ్వరి ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఇచ్చిన ప్రతీ హామీని నిలబెటు ్టకుంటానని చంద్రబాబు చెప్పడం "ఈ సంవత్సరంలోనే అతిపెద్ద జోక్" అని లక్ష్మీపార్వతి ఎద్దేవా చేశారు. ఆడబిడ్డ నిధి, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి కీలక హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దివంగత రాజశేఖర రెడ్డి, జగన్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, చంద్రబాబు, లోకేశ్ అలా కాదని అన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో లోకేశ్ ప్రదర్శించిన 'రెడ్ బుక్' పాలన గురించి కూడా ఆమె ప్రస్తావించారు. వైసీపీ హయాంలో టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకున్న అధికారుల పేర్లు అందులో ఉన్నాయని చెప్పి, ఇప్పుడు కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భువనేశ్వరి క్రియాశీల రాజకీయాల్లోకి వస్తే స్వాగతిస్తానని, అయితే రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు చంద్రబాబు, లోకేశ్‌ల 'రెడ్ బుక్' పాలన, దుష్పరిపాలనలకు గాను రాష్ట్ర ప్రజలకు ఆమె క్షమాపణ చెప్పాలని లక్ష్మీపార్వతి డిమాండ్ చేశారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 1 ఆగష్టు 2026

# ఈ ఏడాది అధికమాసం-తిరుమలలో రెండుసార్లు శ్రీవారి బ్రహ్మోత్సవాలు



**-అధికమాసం కారణంగా తిరుమలలో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు**
**-సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు**
**-అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు**
**-సెప్టెంబర్ 19న గరుడ సేవ, 22న రథోత్సవం**
**-వాహన సేవల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన టీటీడీ**

తిరుమల జూలై 31 వార్త సాక్ష్యం

తిరుమల శ్రీవారి భక్తులకు ఈ ఏడాది కనుల పండుగ కలగనుంది. అధికమాసం కారణంగా కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి రెండుసార్లు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బ్రహ్మోత్సవాల తేదీలను, పూర్తిస్థాయి వాహన సేవల వివరాలను అధికారికంగా ప్రకటించింది. దీంతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మరోసారి మార్మోగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, ఆ తర్వాత అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. సాధారణంగా తెలుగు పంచాంగం ప్రకారం అధికమాసం వచ్చిన సంవత్సరాల్లో శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తూ టీటీడీ ఈ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. మొదటగా, సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. దీనికి సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

**-సాలకట్ల బ్రహ్మోత్సవాల వాహన సేవల పూర్తి షెడ్యూల్:**

సెప్టెంబర్ 15 (మొదటి రోజు): సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం.

సెప్టెంబర్ 16 (రెండో రోజు): ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి హంస వాహనం.

సెప్టెంబర్ 17 (మూడో రోజు): ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం.

సెప్టెంబర్ 18 (నాలుగో రోజు): ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం.

సెప్టెంబర్ 19 (ఐదో రోజు): ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహన సేవ (సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11:30 వరకు).

సెప్టెంబర్ 20 (ఆరో రోజు): ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణ రథం, రాత్రి గజ వాహనం.

సెప్టెంబర్ 21 (ఏడో రోజు): ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం.

సెప్టెంబర్ 22 (ఎనిమిదో రోజు): ఉదయం 7 గంటలకు రథోత్సవం (మహారథం), రాత్రి అశ్వ వాహనం.

సెప్టెంబర్ 23 (తొమ్మిదో రోజు): ఉదయం 6 నుంచి 9 గంటల వరకు చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఈ సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను కూడా టీటీడీ నిర్వహించనుంది. ఈ వివరాలను టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ రెండు బ్రహ్మోత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు తిరుమలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ అన్ని రకాల ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తోంది.

## భోగాపురం ఎయిర్ పోర్టు వద్ద గిరిజన బాలికలు, మహిళల అద్భుతం

# థింసా నృత్యంతో గిన్నిస్ బుక్ రికార్డు





**-భోగాపురంలో థింసా నృత్యంతో గిన్నిస్ ప్రపంచ రికార్డు**
**-సుమారు 13,000 మంది గిరిజన మహిళలు, విద్యార్థినుల ప్రదర్శన**
**-మన్యం సంస్కృతిని ప్రపంచానికి చాటిన ఏపీ ప్రభుత్వం**
**-గిరిజన మంత్రి సంధ్యారాణికి గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందజేత**

జూలై 31 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో గిరిజన విద్యార్థినులు, మహిళలు చారిత్రాత్మక ఘనత సాధించారు. సుమారు 13,000 మంది ఏకకాలంలో సంప్రదాయ థింసా నృత్యం చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డును నెలకొల్పారు. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణం ఈ అద్భుత ప్రదర్శనకు వేదికగా నిలిచింది. రేపు ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయనకు 13 వేల మందితో థింసా నృత్యం ప్రదర్శించడం ద్వారా స్వాగతం పలకనున్నారు. అందుకు సన్నాహకంగా ఇవాళ థింసా నృత్య ప్రదర్శన రిహార్సల్ చేపట్టారు. మన్యం ప్రాంత గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ సంకీర్ణ ప్రభుత్వం ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో వివిధ ఐటీడీఏ పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు. వారంతా సంప్రదాయబద్ధంగా గులాబీ రంగు, ఆకుపచ్చ అంచు చీరలను ధరించి, ఎంతో లయబద్ధంగా థింసా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఈ మహా ప్రదర్శనను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ప్రదర్శన జరిగిందని నిర్ధారించుకున్న తర్వాత, దీనిని అధికారికంగా ప్రపంచ రికార్డుగా ప్రకటించారు. ప్రభుత్వ పక్షాన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి కూడా గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రోజుల తరబడి కఠోర సాధన చేసి ఈ రికార్డును సాధించిన మహిళలు, వారికి శిక్షణ ఇచ్చిన సిబ్బంది, అధికారులను మంత్రి అభినందించారు. గిరిజన కళారూపాలను ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లేందుకు చేసిన ఈ ప్రయత్నాన్ని ఆమె ప్రశంసించారు.

# రూ. 16 కోట్లతో హై లెవల్ బ్రిడ్జి

దక్కిలి, జూలై 31 వార్త సాక్ష్యం :

దక్కిలి మండలం లింగసముద్రం వద్ద జాతీయ రహదారి నెంబర్ 565పై నిర్మించనున్న హైలెవల్ వంతెనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రేపు శంకుస్థాపన చేయనున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా చేపట్టనున్న పలు కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పనులతోపాటు ఈ వంతెన నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని కూడా వర్చువల్ విధానంలో ఆయన ఆవిష్కరించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రూ.16 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ హై లెవల్ వంతెన నిర్మాణం పూర్తయితే పెంచలకోన-ఏర్పేడు మధ్య రాకపోకలు మరింత సురక్షితంగా, వేగవంతంగా మారనున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే రవాణా అంతరాయాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. లింగసముద్రం వద్ద పాత వంతెన గతంలో సంభవించిన భారీ వరదలతో బలహీనపడింది.



# కృష్ణమ్మకు జలకళ

**-శ్రీశైలం జలాశయానికి పెరుగుతున్న వరద**



కర్నూలు, జూలై 31 వార్త సాక్ష్యం :

కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ జలకళ సంతరించుకుంది. ఆల్మట్టి, నారాయణపుర్, జూరాల జలాశయాలు పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరుకున్నాయి. క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద క్రమక్రమంగా పెరుగుతోంది. శుక్రవారం జూరాల నుంచి 1,31,094 క్యూసెక్కులు విడుదల చేశారు. శ్రీశైలం డ్యాం వద్ద 92,709 క్యూసెక్కులు నమోదైంది. మూడు రోజుల్లోనే 13 టీఎంసీల వరద చేరింది. డ్యాం గరిష్ట నీటి మట్టం 855 అడుగులు, పూర్థిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా.. 834.40 అడుగుల వద్ద 54.349 టీఎంసీలు చేరింది. ప్రస్తుతం రోజు సగటున 8-9 టీఎంసీలు చేరుతోంది. ఇదిలా ఉండగా తుంగభద్ర జలాశయానికి వరద తగ్గుముఖం పట్టింది. 15,690 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే కొనసాగుతోంది. డ్యాం గరిష్ట నీటి మట్టం 1633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105,788 టీఎంసీలు కాగా.. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో 1609.74 అడుగుల లెవల్‌లో 37.063 టీఎంసీలు వరద చేరింది. రెండు రాష్ట్రాల్లో తాగునీటి అవసరాల కోసం 3,643 క్యూసెక్కులు కాలువలకు వదులుతున్నారు.

# పంటల బీమాపై ఆసక్తి చూపని రైతులు



చిత్తూరు సెంట్రల్,జూలై 31 వార్త సాక్ష్యం

పంటల బీమా చేసుకోడానికి గడువు శుక్రవారంతో ముగియనుంది. ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే సాగు చేసిన పంటలకు బీమా చేసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశాయి. వాతావరణ ఆధారిత పంటలైన వేరుశనగ, టమాటాకు గడువు ఈనెల 24కు ముగిసినా, రైతుల సౌలభ్యం కోసం 31వ తేది వరకు పొడిగించారు. అయినా ప్రయోజనం నామమాత్రంగానే ఉంది. తాము గతంలో పంట నష్టపోయినా బీమా సొమ్ము అందలేదని పలువురు రైతులు అసంతృప్తితో ఉన్నారు. ఈ కారణంగానే వాళ్లతా బీమా చేయించుకునేందుకు ముందుకు రాలేదని తెలిసింది. రైతుల్లోని ఇలాంటి అనుమానాలను నివృత్తి చేసి, వారిని బీమా వైపు మొగ్గు చూపేలా చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. ఎల్‌నినో నేపథ్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల తరపున ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి రైతులు పంటలకు బీమా చేసే దిశగా ప్రోత్సహించాల్సిన బాధ్యత వారిపై ఉంది. అలా బీమా చేయించి ఉంటే వర్షాభావంతో పంటలు దెబ్బతిన్నా పరిహారం లభించి రైతులకు కొంత ఊరటైనా లభించి ఉండేది. మిగిలింది ఒక్క రోజే రైతులు సాగు చేసిన పంటలను బీమా చేసుకునేందుకే కేవలం ఒక్క రోజే మిగిలింది. రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకున్న వారికి మాత్రమే బీమా వర్తించనుంది. ఇప్పటి వరకు 21,037 ఎకరాల్లో పంటలు సాగవగా.. పది వేల ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేశారు. ఇందులోనూ 3569 ఎకరాల్లోని పంటలకే రైతులు బీమా చేసుకున్నారు. మిగిలిన రైతులు వెంటనే ఈ-క్రాప్ నమోదు చేసుకుని బీమా చేసుకునే వెసులుబాటు ఉంది. దీనికి మిగిలింది ఒక్క రోజే. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కౌలు రైతులైతే సీసీఆర్‌సీ పత్రం, రైతు సేవా కేంద్రంనందు పనిచేసే వ్యవసాయ సిబ్బంది జారీ చేసే పంట సాగు ధ్రువీకరణ పత్రం, రైతు డిక్లరేషన్, మొబైల్ నంబరు, రైతు సేవింగ్స్ బ్యాంకు ఖాతా అకౌంట్స్ మొదటి పేజీ కాపీ. మండల వ్యవసాయ శాఖ కార్యాలయం, రైతు సేవా కేంద్రం, కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్సీ), నేషనల్ క్రాప్ ఇన్స్యూరెన్స్ పోర్టల్, పీఏసీఎస్ ప్రీమియం చెల్లించొచ్చు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## రహదారులపై 4,000 ఎలక్ట్రిక్ బస్సులు



హైదరాబాద్ :
ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ష ట్ర గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) కీలక మైలురాయిని అధిగమించింది. ఇప్పటి వరకు ఈ సంస్థ.. వివిధ రాష్ట్ర ప్రభుత్వ రోడ్డు రవాణా సంస్థలకు అందించిన ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 4,000కు చేరింది. హిమాచల్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (హెచ్‌ఆర్‌టీసీ) కోసం 4,000వ బస్సును తయారు చేసి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్‌కు అందజేయటం ద్వారా ఈ ఘనతను సాధించినట్లు ఒలెక్ష?ట్ర వెల్లడించింది. అంతేకాకుండా హెచ్‌ఆర్‌టీసీకి అందించిన మొత్తం బస్సుల సంఖ్య 297కి చేరిందని పేర్కొంది. కాగా ఇప్పటి వరకు మరే భారతీయ కంపెనీ ఈ స్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులను దేశంలో తయారు చేయలేదని తెలిపింది. వివిధ రాష్ట్రాల ఆర్‌టీసీలకు తాము సరఫరా చేసిన 4,000 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటి వరకు 73 కోట్ల కిలోమీటర్లు ప్రయాణించి 6.5 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించినట్టు గ్రీన్‌టెక్ తెలిపింది.

## మైక్రోసాఫ్ట్ ఆల్‌టైమ్ రికార్డ్ - ఒక్క రోజులోనే రూ.39 లక్షల కోట్లు జంప్!

జులై 31:
అమెరికా మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ లేని ఒక అద్భుతమైన రికార్డు నమోదైంది. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏకంగా ఒక్క రోజులోనే తన మార్కెట్ విలువకు దాదాపు 450 బిలియన్ డాలర్లు (సుమారు రూ.39 లక్షల కోట్లు) పెంచుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది.వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ చరిత్రలో ఏ ఒక్క నమోదిత కంపెనీ కూడా ఒక్క రోజు ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేదు. ఈ సంచలన ర్యాలీతో మైక్రోసాఫ్ట్.. ప్రముఖ ఏఐ చిప్‌మేకర్ 'ఎన్విడియా'ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే అత్యంత విలువైన పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా మళ్లీ తన స్థానాన్ని కైవసం చేసుకుంది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత మైక్రోసాఫ్ట్ షేర్లు ఒక్కసారిగా 9 శాతం పెరిగాయి. ఫలితంగా ఒక్క రోజులోనే పొందిన ఈ అదనపు మార్కెట్ విలువ, దక్షిణాఫ్రికా, వియత్నాం, టర్కీ వంటి దేశాల మొత్తం స్టాక్ మార్కెట్ విలువల కంటే చాలా పెద్దది కావడం విశేషం.అజూర్ క్లౌడ్ మ్యాజిక్ ఈ చరిత్రాత్మక ర్యాలీ వెనుక ఉన్న ప్రధాన కారణం మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజూర్' క్లౌడ్ బిజినెస్. విశ్లేషకులు ఊహించిన దానికంటే అజూర్ క్లౌడ్ ఆదాయం మెరుగైన వృద్ధిని కనబరిచింది. గత కొద్ది కాలంగా మైక్రోసాఫ్ట్ ఏఐ మౌలిక వసతులు, డేటా సెంటర్లు, చిప్‌లపై బిలియన్ల కొద్దీ డాలర్లను గుమ్మరిస్తోంది. ఈ భారీ పెట్టుబడులు నిజంగానే లాభాలను తెచ్చిపెడతాయా అనే సందేహాలకు ఈ ఆర్థిక ఫలితాలు స్పష్టమైన సానుకూల సమాధానాన్ని ఇచ్చాయి. రాబోయే త్రైమాసికంలో కూడా ఏఐ-ఆధారిత క్లౌడ్ సేవల డిమాండ్ బలంగా ఉంటుందని కంపెనీ వేసిన అంచనాలు నిజమయ్యాయి.




## ఇథనాల్ కలపకుంటే లీటర్ పెట్రోల్ ధర రూ.125 అయ్యేది: కేంద్రం

పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం కలపకపోయి ఉంటే ఇటీవల పశ్చిమాసియా సంక్షోభం సమయంలో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర దాదాపు రూ.125కు చేరేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇథనాల్ బ్లెండింగ్ వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినా వినియోగదారులపై భారం పడలేదని పేర్కొంది. ఈ విధానం కారణంగా లీటర్‌కు దాదాపు రూ.30 వరకు ఆదా అయ్యిందని కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో భారత క్రూడాయిల్ బాస్కెట్ ధర బ్యారెల్‌కు 135 డాలర్ల వరకు చేరిందని తెలిపింది. ఆ పరిస్థితిలో ఇథనాల్ మిశ్రమం లేకుంటే పెట్రోల్ ధర రూ.125కు చేరేదని వివరించింది. అయితే ప్రస్తుతం ప్రతి లీటర్‌లో 20 శాతం దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌ను కలపడం వల్ల ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.94.77కే పరిమితమైందని పేర్కొంది. ఇథనాల్ బ్లెండింగ్‌తో ముడిచమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గుతోందని కేంద్రం వెల్లడించింది. ఇప్పటివరకు ఈ కార్యక్రమం వల్ల రూ. 1.97 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అయినట్లు తెలిపింది. అలాగే 950 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలు తగ్గాయని పేర్కొంది. రైతులు, డిస్టిలరీలకు రూ.1.66 లక్షల కోట్లకుపైగా చెల్లింపులు జరిగాయని వెల్లడించింది.




ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మిగులు ధాన్యాన్నే ఇథనాల్ తయారీకి వినియోగిస్తున్నామని కేంద్రం స్పష్టం చేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థ, జాతీయ ఆహార భద్రత చట్టం, సంక్షేమ పథకాల కోసం అవసరమైన ధాన్యాన్ని మళ్లించడం లేదని తెలిపింది. మానవ వినియోగానికి పనికిరాని ధాన్యం, విరిగిన బియ్యాన్ని కూడా ఈ కార్యక్రమంలో వినియోగిస్తున్నట్లు వివరించింది

## జెర్సీ రంగు మార్పు వివాదంలో ట్విస్ట్- వివరణకు ఆదేశించిన హాకీ ఇండియా అధ్యక్షుడు

ఇంటర్నెట్ డెస్క్:
భారత హాకీ జట్ల జెర్సీ రంగు మార్పు వివాదం కొత్త మలుపు తిరిగింది. ఈ అంశంపై ఎగ్జిక్యూటివ్ బోర్డు అధికారులను వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ లేఖ రాశారు. భారత పురుషులు, మహిళల జట్ల నీలం జెర్సీని కాషాయ రంగులోకి మార్చే నిర్ణయాన్ని ఎగ్జిక్యూటివ్ బోర్డు ముందుకు తీసుకురాకుండానే అమలు చేశారని, తనకు కూడా ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఇప్పటి వరకు ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన టిర్కీ.. తాజాగా దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేయడం చర్చకు దారి తీసింది. జాతీయ జట్టు గుర్తింపుతో ముడిపడిన ఇలాంటి కీలక నిర్ణయాలు ఎన్నికైన నాయకత్వం, ఎగ్జిక్యూటివ్ బోర్డుతో చర్చించిన తర్వాతే తీసుకోవాల్సిందని టిర్కీ పేర్కొన్నారు. ఈ అంశంపై ఒడిశా ప్రభుత్వం కూడా తనను వివరణ కోరిందని, అందుకే నిర్ణయం ఎలా తీసుకున్నారు? ఎలాంటి ప్రక్రియ అనుసరించారు? ఎవరి అనుమతితో అమలు చేశారనే వివరాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని అధికారులను ఆదేశిం చారు. తదుపరి మెయిల్‌లో కూడా ఆయన ఐదు కీలక ప్రశ్నలు సంధిస్తూ, బోర్డు సభ్యులకు సమా చారం ఇవ్వకుండా ఈ నిర్ణయం ఎందుకు తీసుకు న్నారో స్పష్టం చేయాలని కోరారు. దీంతో హాకీ ఇండియాలో అంతర్గత విభేదాలు బహిర్గ తమైనట్లు చర్చ జరుగుతోంది. అయితే అంతర్జాతీయ హాకీలో అంతటా వాడుతున్న సింథటిక్ పిచ్‌లు నీలి రంగులో ఉంటాయి. జెర్సీలు కూడా అదే రంగులో ఉంటే కలిసిపోతున్నాయని.. అందుకే ఆటగాళ్లు, కోచ్‌ల సూచనతో జాతీయ జెండాలో భాగమైన కాషా యాన్ని ఎంపిక చేశామని హాకీ ఇండియా పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే జెర్సీ రంగు మార్పుపై విమర్శలు




## టీమిండియాకు గుడ్‌న్యూస్- శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు బుమ్రా సిద్ధం

ఇంటర్నెట్ డెస్క్:
శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు ముందు భారత జట్టుకు ఓ గుడ్‌న్యూస్ అందింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించినట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ పరీక్షల్లో బుమ్రా పాసైనట్లు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వెల్లడించింది. దీంతో ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉండనున్నాడు. ఈ సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ ఇటీవల జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. బుమ్రా, సాయి సుదర్శన్‌లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తేనే మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారని అందులో పేర్కొంది. తాజా పరిణామంతో బుమ్రా ఆడటంపై క్లారిటీ వచ్చినట్లే.ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో బుమ్రా తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. దీంతో లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేకు దూరమయ్యాడు. అయితే ఇప్పుడు పూర్తిగా కోలుకుని శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి గాలేలో ప్రారంభమయ్యే తొలి టెస్టుతో పాటు ఆగస్టు 23 నుంచి కొలంబోలో జరిగే రెండో టెస్టులోనూ ఆడే అవకాశాలు మెరుగయ్యాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ మిగిలిన తొమ్మిది టెస్టుల్లో కనీసం ఏడు మ్యాచ్‌లు గెలవాల్సి ఉంది. అందులో భాగంగా శ్రీలంకపై 2-0తో సిరీస్ గెలవడం భారత జట్టుకు అత్యంత కీలకం. ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటన ఉండటంతో ఈ సిరీస్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పటికే గాయాల కారణంగా హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి జట్టుకు దూరమయ్యారు. అలాగే వాషింగ్టన్ సుందర్ కండరాల గాయంతో తొలి టెస్టుకు అందుబాటులో ఉండడం లేదు. ఆకాశ్ దీప్ కూడా వెన్ను ఒత్తిడి గాయం నుంచి ఇంకా కోలుకుంటున్నాడు. ఈ పరిస్థితుల్లో బుమ్రా ఫిట్‌నెస్ సాధించడం టీమిండియాకు భారీ ఊరటనిచ్చే అంశంగా మారింది.




# స్పోర్ట్స్

## 2027 వన్డే ప్రపంచ కప్ భువీని జట్టులోకి తీసుకోవాలి: అశ్విన్



ఇంటర్నెట్ డెస్క్:
వన్డే ప్రపంచ కప్ 2027 సమీపిస్తోన్న నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రపంచ కప్‌లో భారత తుది జట్టు గురించి అంచనా వేశాడు. ఈ క్రమంలో స్టార్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి తీసుకోవాలని మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. ఈ మెగా టోర్నీకి సౌతాఫ్రికా, నమీబియా, జింబాబ్వే దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న సంగతి తెలిసిందే. విదేశీ పిచ్‌లపై భువీ అనుభవం ఎంతో ఉపయోగ పడుతుందని అభిప్రాయ పడ్డాడు. వన్డే ప్రపంచ కప్ 2027లో భువనేశ్వర్ కుమార్‌ను కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలి. ఫస్ట్‌క్లాస్, విజయ్ హజారే ట్రోఫీ సహా అన్ని టోర్నీల్లో అతడిని ఆడించి దక్షిణాఫ్రికా ప్రపంచ కప్‌కు సిద్ధం చేయాలి. అక్కడ అతడి అనుభవం జట్టుకు ఎంతో అవసరం అవుతుంది' అని అశ్విన్ పేర్కొన్నాడు. 2022 తర్వాత వన్డేలు ఆడని భువనేశ్వర్.. ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు టైటిల్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ సీజన్‌లో 28 వికెట్లు తీసి తన సత్తా చాటాడు. దీంతో ప్రపంచకప్‌కు జట్టును సిద్ధం చేసే క్రమంలో అతడిని మరోసారి పరిశీలించాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మరోవైపు శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్టులో భారత్ ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగాలని అశ్విన్ సూచించాడు. రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, కుల్‌దీప్ యాదవ్.. ఈ ముగ్గురినీ తుది జట్టులోకి తీసుకోవాలని అన్నాడు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

## షూటింగ్‌లో రష్మికకు గాయం.. ఆరు వారాల విశ్రాంతి



ప్రముఖ నటి రష్మిక మందన్న ఒక చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారు. ఒక పాట చిత్రీకరణలో భాగంగా డ్యాన్స్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆమెను పరీక్షించిన వైద్యులు తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు నిర్ధారించి, ఆరు వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రష్మిక మందన్న 'రణబాలి' అనే చిత్రంలో తన భర్త, హీరో విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్నారు. దీనితో పాటు, 'మైసా' అనే మహిళా ప్రాధాన్యత కలిగిన చిత్రంలోనూ ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న తరుణంలో రష్మిక గాయపడటం ఆమె నటిస్తున్న చిత్రాల షూటింగ్‌లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆరు వారాల పాటు రష్మిక విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో, ఆమె అంగీకరించిన సినిమాల చిత్రీకరణ షెడ్యూల్స్ వాయిదా పడనున్నాయి. ఈ గాయం నుండి ఆమె త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## ఒకవైపు నీతులు, మరోవైపు పార్టీలా?
## కంగన పాత వీడియోతో సోషల్ మీడియాలో రచ్చ

బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. యువతరంపై ఆమె చేసిన 'గట్టర్ జనరేషన్' వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ, ఆమెకు సంబంధించిన ఒక పాత వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆఇటీవల నీట్-యూజీ 2026 నిరసనలపై స్పందిస్తూ, ఆందోళనల్లో పాల్గొంటున్న మహిళలను ఉద్దేశించి కంగనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాశ్చాత్య సంస్కృతిని అనుసరించే కొందరు భారతీయ మహిళలు దేశ సంప్రదాయాలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్నారని, వారిని 'జనరేషన్ గట్టర్' అని పిలుస్తానని అన్నారు. వారికి చదువు సరిగా రాదని, మంచి గృహిణులుగా కూడా ఉండలేరని ఘాటుగా విమర్శించారు. అంతకుముందు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధి సౌరవ్ దాస్‌ను 'పనికిరాని నిరుద్యోగి' అని తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పేర్కొన్నారు.

**-వైరల్ అవుతున్న పాత వీడియో**

ఈ వివాదం నడుస్తుండగానే, కంగనాకు సంబంధించిన ఒక పాత వీడియోను నెటిజన్లు వెలుగులోకి తెచ్చారు. 2018లో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా జరిగిన ఒక ఆఫ్టర్-పార్టీలో కంగనా ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ, సరదాగా గడుపుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. నలుపు రంగు దుస్తుల్లో ఆమె స్వేచ్ఛగా పార్టీని ఆస్వాదిస్తున్నట్లు కనిపించింది.


**-సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన**

ఈ వీడియో వైరల్ అవ్వడంతో సోషల్ మీడియాలో పెద్ద చర్చే మొదలైంది. యువతకు, మహిళలకు నీతులు చెబుతున్న కంగనా, గతంలో ఇలా పార్టీలలో స్వేచ్ఛగా గడపడం ఏమిటని కొందరు ఆమె ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తూ ట్రోల్ చేస్తున్నారు.



అయితే, మరికొందరు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. "ఆమె తన వ్యక్తిగత జీవితంలో సరదాగా గడపటంలో తప్పేముంది? ఎవరినీ ఇబ్బంది పెట్టనంత వరకు సమస్య లేదు కదా?" అంటూ కామెంట్లు పెడుతున్నారు. తన నటనతో ఎంతో పేరు తెచ్చుకున్న కంగనా, ఇలాంటి వ్యాఖ్యలతో తన స్థాయిని తగ్గించుకోవద్దని మరికొందరు హితవు పలుకుతున్నారు. మొత్తం మీద, సౌరవ్ దాస్‌తో మొదలైన మాటల యుద్ధం, 'గట్టర్ జనరేషన్' వ్యాఖ్యలతో మరింత ముదిరి, ఇప్పుడు పాత వీడియో వైరల్ అవ్వడంతో ఈ వివాదం మరింత పెద్దదవుతోంది. ఈ అంశంపై నటులు సోనూసూద్, రాఖీ సావంత్ వంటి వారు కూడా కంగనా వ్యాఖ్యలను విమర్శించారు.

## 'రామాయణం' ట్రైలర్‌పై శివసేన
## మాజీ ఎంపీ ప్రియాంక చతుర్వేది ఆగ్రహం




బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న 'రామాయణం' చిత్ర ట్రైలర్‌పై శివసేన (యూబీటీ) నాయకురాలు, మాజీ రాజ్య సభ ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శలు గుప్పించారు. చిత్రంలో నటీనటుల ఎంపిక (క్యాస్టింగ్), విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్), నటన, వస్త్రధారణ, సంగీతం వంటి ఏ అంశం కూడా ఆకట్టుకునేలా లేదంటూ ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "'రామాయణం' టీజర్‌ను ఇప్పటివరకు ఎందుకు ఇంత రహస్యంగా ఉంచారో ఇప్పుడు అర్థమవు తోంది. చిత్రంపై నెలకొన్న భారీ అంచనాలకు ఇది ఏమాత్రం తగినట్లుగా లేదు. సరిగ్గా లేని నటీనటుల ఎంపిక, వీఎఫ్ఎక్స్, నటన, వింతగా ఉన్న వస్త్రధారణ, ఇంకా మెరుగ్గా ఉండాల్సిన సంగీతం ఇలాఏదీ మెప్పించేలా లేదు. దూరదర్శన్ 'రామాయణం' ఎప్పటికీ అజరామరంగా నిలిచి పోతుంది" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నితేష్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్ర టీజర్‌ను గురువారం బ్రహ్మ ముహూర్తంలో విడుదల చేశారు. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2026 నవంబర్ 8న దీపావళి కానుకగా విడుదల చేయనున్నారు. అయితే, హనుమంతుడి పాత్ర పోషిస్తున్న సన్నీ డియోల్ ఈ టీజర్‌లో ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈ టీజర్‌పై సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. చిత్ర నిర్మాణ విలువలు, రావణుడిగా యశ్ ఆహార్యం, విజువల్స్‌ను కొందరు నెటిజన్లు ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం సన్నివేశాల్లో భావోద్వేగాలు కొరవడ్డాయని, కొన్ని పాత్రల ఎంపికతో పాటు ఆధునిక శైలిలో ఉన్న స్టైలింగ్ ఏమాత్రం బాగోలేదని విమర్శిస్తున్నారు.

## ఇండస్ట్రీలోకి బాలయ్య కుమార్తె ఎంట్రీ..?

నటసింహం నందమూరి బాలకృష్ణ చిన్న కుమార్తె నందమూరి తేజస్విని సినీ రంగంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఓ వైవిధ్యమైన చిత్రంతో ఆమె హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం కానున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సందేశాత్మక అంశాలతో తెరకెక్కనున్న స్పోర్ట్స్ డ్రామా ద్వారా తేజస్విని తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఆసక్తికరంగా, బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ సినీ అరంగేట్రం కంటే ముందే తేజస్విని కెమెరా ముందుకు రానున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది. ఇటీవల ప్రముఖ కొరియోగ్రాఫర్ భాను మాస్టర్‌తో కలిసి 'లవ్ స్టోరీ' చిత్రంలోని 'సారంగ దరియా' పాటకు తేజస్విని చేసిన డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. ఆమె డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌కు నందమూరి అభిమానులు ప్రశంసలు కురిపించారు. ఈ నేపథ్యంలో తేజస్విని హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తారనే ప్రచారం నందమూరి అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే దీనిపై బాలకృష్ణ కుటుంబం, చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.